# నేతల స్ఫూర్తితో.. సమరోత్సాహం

- పెద్దిపాలెం సభతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- కూటమి అరాచక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నేతల ఉద్బోధ



మాట్లాడుతున్న భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు

**తగరపువలస:** కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై మొట్ట మొదటిసారిగా వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ముఖ్య నాయకులతో ఆనందపురం మండలం పెద్దిపాలెం చెన్నా ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం భీమిలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల్లో సమరోత్సాహం నింపింది. ఇలాంటి సమీక్షా సమావేశాలు వెనుకబడిన ఉత్తరాంధ్రలోని వివిధ ప్రాంతాల్లో తరచూ నిర్వహించడం వల్ల ఆయా ప్రాంతాల ప్రజల్లో ఆలోచనలు రేకెత్తి అభివృద్ధి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తారని నాయకులు అభిప్రాయపడ్డారు. పార్టీ రీజినల్ అధ్యక్షుడు కురసాల కన్నబాబు అధ్యక్షతన జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శాసన మండలి నేత బొత్స సత్యనారాయణ, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమరనాథ్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు చేసిన ప్రసంగాలు ఉత్తేజపరిచాయి. నర్సీపట్నం నియోజకవర్గంలో మెడికల్ కళాశాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిన కారణంగా ఈ నెల 9న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో భాగంగా ఇటీవల జీవీఎంసీ పరిధిలో తొలగించిన చిరువ్యాపారుల దుకాణాలు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ కంపెనీ, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ, భీమిలిలో భూములను ఐటీ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడంపై మాట్లాడారు.

**అన్నింటా కూటమి ప్రభుత్వం విఫల్యం..**

వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు అభివృద్ధి ఏదైనా జరిగిందంటే అది వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిల హయాంలో మాత్రమే అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో భోగాపురం ఎయిర్‌పోర్టు, మూలపేట పోర్టు, ఉద్దానంలో వైద్యాలయం, విశాఖలో ఇనార్బిట్ మాల్ వంటి అభివృద్ధి జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిని పక్కనపెట్టి విజయనగరం నుంచి విశాఖ వరకు ముఖ్యంగా భీమిలిలో ఖరీదైన స్థలాలను బినామీల పేర్లతో కారుచౌకగా ఐటీ సంస్థల పేర్లతో భూములు కొల్లగొడుతుందన్నారు. గూగుల్ సంస్థ పేరుతో ఆనందపురంలో రైతులను బెదిరించి రెవెన్యూ రికార్డులు మార్చి తమ తాబేదారులకు దోచిపెట్టడానికి చంద్రబాబు ప్రయత్నిస్తున్నారన్నారు.

### భీమిలి పార్టీలో నూతన ఉత్తేజం..



ఉత్తరాంధ్ర ముఖ్య నాయకులతో వైఎస్సార్‌సీపీ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం ముందుగా భీమిలిలో పార్టీ శ్రేణులలో నూతన ఉత్తేజాన్ని నింపింది. అక్కడక్కడ స్తబ్దంగా ఉండిపోయిన కార్యకర్తలకు ధైర్యం నింపినట్టయింది.

– దంతులూరి వాసురాజు, భీమిలి ఎంపీపీ

### కూటమి కార్యకర్తలు విసిగిపోయారు



కూటమి పాలనతో ఆ పార్టీ కార్యకర్తలు, నాయకులే విసిగిపోయారు. తమను మూడు పార్టీలు పట్టించుకోవడం లేదని, తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారం చేపడుతుందని అంటున్నారు. దీనికి తోడు ఈ రోజు జరిగిన సమీక్షా సమావేశంతో వైఎస్సార్‌సీపీ మరో మెట్టు ఎక్కినట్టయింది.

– కోరాడ వెంకటరావు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు

### లోపాలను సరిదిద్దుకుంటాం..



గతంలో జరిగిన చిన్న చిన్న లోపాలను సరిదిద్దుకుని పార్టీని బలోపేతం చేసుకోవడానికి ఈ సమీక్షా సమావేశం దోహదపడింది. కూటమి ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజల్లోకి తీసుకుపోతాం. మా వెనుక అనుభవజ్ఞులైన నేతలు ఉన్నారన్న అభయం కలిగింది.

– బంక సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు, ఆనందపురం

## నేటి నుంచి బంగారమ్మ ఉత్సవాలు



కృష్ణాపురంలోని బంగారమ్మ ఆలయం



బంగారమ్మ

**పద్మనాభం:** మండలంలోని కృష్ణాపురంలో సుంకర వారి కుటుంబ సభ్యుల ఇలవేల్పు అయిన బంగారమ్మ ఉత్సవాలు సోమవారం తొలేళ్లతో ప్రారంభమవుతాయి. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారు. మంగళవారం రథాల ఉత్సవం జరుగుతుంది. వ్యవసాయ బళ్లను రథాలుగా తీర్చిదిద్ది గ్రామంలో ఊరేగిస్తారు. బుధవారం ముగింపు ఉత్సవం జరుగుతుంది. ఉత్సవాలకు ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. గ్రామంలో నుంచి అమ్మవారి ఆలయం వరకు లైటింగ్ ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

## క్లుప్తంగా

### సూర్యప్రకాశరావుకు సత్కారం



సూర్యప్రకాశరావుని సత్కరిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

**మధురవాడ:** రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన మధురవాడ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్య ప్రకాశరావు దంపతులను ఆ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఆదివారం అయ్యప్పనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నాయకులు వారికి పూల మాలలు వేసి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. వీరిలో పౌర సంక్షేమ సంఘం నాయకులు బెల్లాపు పాపారావు, శ్రీపాద వెంకటరమణ, పోలిశెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ ఎస్. రమేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరుపిళ్ల పైడిరాజు తదితరులు ఉన్నారు.

### ఆలయ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నేడు



శాంతి కల్యాణం జరిపిస్తున్న పండితులు

**తగరపువలస:** చిట్టివలస జ్యూట్‌మిల్లు రోడ్డులో గురుస్వామి ఆకెళ్ల నరసింహమూర్తి ఇంటి ఆవరణలో శ్రీ అరుణాచలేశ్వర స్వామి సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాలు సోమవారం జరగనున్నాయి. రెండు రోజులుగా అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజ్, రవిగణేష్ శర్మల ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు, శాంతి హోమాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. సోమవారం విగ్రహాల ప్రతిష్ట అనంతరం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మహా అన్నప్రసాద వితరణ, సాయంత్రం అయ్యప్పస్వామికి మహా పడిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాలను భక్తులంతా జయప్రదం చేయాలని కోరారు.


### అమ్మవార్ల విగ్రహాల నిమజ్జనం

**తగరపువలస:** ఇటీవల శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిసినందున భీమిలి అర్బన్, రూరల్ పరిధిలో పలు మండపాల నుంచి అమ్మవారి విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. అమ్మవార్లను ఊరేగింపుగా అంబేడ్కర్ కూడలి మీదుగా నేలవేషాలు, బాణసంచా, కోలాటంతో చిట్టివలస, మూలకుద్దు, టి.నగరపాలెం వద్ద గోస్తనీ నదిలో నిమజ్జనం చేశారు. భీమిలి పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

### భారీ అన్నసమారాధన

**ఆరిలోవ:** జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి కొండవాలు ప్రాంతం ఈశ్వరినగర్‌లో జరుగుతున్న దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. ఎర్నిదుర్గా, మహాకాళి, భైరవ శక్తి పీఠం గురుస్వామి అభిరాం అఘోరా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాంసాహారంతో కూడిన అన్నదానం చేశారు. పెదగదిలి, చినగదిలి, ఈశ్వరినగర్, సాలిపేట తదితర కొండవాలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారి అనుపు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

### నవ్వుల్లో ముంచెత్తిన వినోదాల విందు



స్కిట్ ప్రదర్శిస్తున్న సుబ్రహ్మణ్యం, ప్రకాష్

**సీతంపేట:** ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ (విశాఖ, హైదరాబాద్) ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే వినోదాల విందులో భాగంగా ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కామెడీ షో జరిగింది. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, పుష్పమి, రాగస్ నాయుడు, సూర్య, ఎస్.ఎస్.నాయుడు, పోర్టు శేషు, భానుప్రకాష్‌లు ప్రదర్శించిన కామెడీ స్కిట్లు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తాయి. అత్తగారి ఏడుపు, థియేటర్‌లో ఉన్నాను, కవిత, అన్నదానం, ఎంతమంది పిల్లలు, దారి ఎటు పోతుంది, సెలూన్, ఇంజినీరింగ్ కుటుంబం, రేటు ఎంత, డాక్టర్ పేషెంట్, డిశ్చార్జ్ ఎప్పుడు నాటికలు అలరించాయి. శివా క్లాసికల్ డ్యాన్స్ మ్యూజిక్ అకాడమీ అండ్ యోగా గురువు శివా శిష్య బృందం లిఖిత, సంజన చేసిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కళాకారులను అతిథులు సన్‌మూర్తి, మాల్యాద్రి, సాత్యకి ప్రసాద్, విశ్రాంత డీపీఆర్‌వో ఎల్.బి.వెంకటరావు చేతుల మీదుగా సత్కరించారు.

# పూర్వ విద్యార్థుల సందడి



కలుసుకున్న పూర్వ విద్యార్థులు

**భీమునిపట్నం:** విశాఖ ఏవీఎన్ కళాశాలలో 1977 నుంచి 80 వరకు సైన్స్ డిగ్రీ చేసిన పూర్వ విద్యార్థులు 40 మంది కోట పద్మారాణి నివాసం వద్ద కలుసుకున్నారు. చిన్నపిల్లల్లా సరదాగా గడిపారు. అప్పటి రోజుల్లో ఎలా ఉండేవారు, సరదాల గురించి మాట్లాడుకుని ఎంతో సంతోషించారు. అలాగే ఎవరు ఎక్కడుంటున్నారు, ఏం చేస్తున్నారు, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ విశ్వేశ్వరరావు, ప్రొఫెసర్ మురళి, పారిశ్రామిక వేత్త మోహనరావు, రైల్వే అధికారి బాలాజీ, మెరైన్ ఇంజినీర్ శ్రీనివాసరావు తమ అనుభవాలను తెలిపారు. ఈ సందర్భంగా తాము చదువుకున్న కళాశాలకు తగిన మేరకు సాయం చేయాలని నిర్ణయించారు. సాయంత్రం వరకు అందరు ఆనందంగా గడిపి తిరిగి తమ గమ్యస్థానాలకు పయనమయ్యారు.

## బంగ్లామెట్టపై మురుగు ప్రవాహం



శిథిలమైన డ్రైనేజీ నుంచి ప్రవహిస్తోన్న మురుగు

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు బంగ్లామెట్టపై శిథిలమైన డ్రైనేజీల నుంచి మురుగు నీరు రహదారి పైకి ప్రవహిస్తోంది. గుంతల్లో చేరి వాహనాల రాకపోకల కారణంగా నడిచి వెళ్లేవారిపై తుల్లుతోంది. ఇక్కడి శివాలయంతో పాటు బస్ షెల్టర్ ఉన్న మార్గంలో మురుగునీటిలో నుంచే భక్తులు, విద్యార్థులు రాకపోకలు సాగించవలసి వస్తోంది. ఈ ప్రాంతంలో డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా లాభం లేకుండాపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా బంగ్లామెట్ట శివాలయం నుంచి భోగాపురపు వారి వీధి వరకు డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

# నిబంధనల ప్రకారమే నిర్మాణాలు



మాట్లాడుతున్న శివకేశవ ఆలయాల ఎగ్జిక్యూటివ్ అథారిటీ సింగరాచార్యులు

**భీమునిపట్నం:** భీమిలి శివకేశవ ఆలయాల ప్రాంగణంలో జరుగుతున్న షాపుల నిర్మాణంలో ఎటువంటి తప్పులు జరగలేదని నిబంధనల ప్రకారం గుడ్‌విల్ విధానంలో నిర్మాణాలు జరుగుతున్నాయని ఆలయ ఎగ్జిక్యూటివ్ అథారిటీ ఆర్. సింగరాచార్యులు తెలిపారు. ఆదివారం దీనికి సంబంధించి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. ఇక్కడ షాపుల నిర్మాణానికి దేవాదాయ శాఖ వద్ద నిధులు లేవని అందువల్ల వారు నిర్మించే అవకాశం లేదన్నారు. అయితే ప్రస్తుతం ఆ శాఖకు చెందిన షాపుల్లో అద్దెకు ఉన్నవారి సహకారంతో గుడ్‌విల్ విధానంలో నిర్మాణం చేపట్టామని తెలిపారు. దాని ప్రకారం మూడు పెద్దవి, ఒక చిన్న షాపు ఏర్పాటు జరుగుతుందని, అలాగే కొందరు దాతలు ముందుకు రానున్న నేపథ్యంలో షాపుల పైన అర్చకుల నివాసాల నిర్మాణం జరుగుతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు జరగడం లేదని స్పష్టం చేశారు.

# దళిత రైతులకు అండగా సీపీఎం



తర్లువాడలో దళిత రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

**తగరపువలస:** ఆనందపురం మండలం తర్లువాడలో దళిత రైతులకు చెందిన భూములను కూటమి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ పేరుతో కాజేసి గూగుల్ టెక్ కంపెనీకి అప్పగించేందుకు ప్రయత్నిస్తుందని సీపీఎం భీమిలి డివిజన్ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి ఆరోపించారు. ఆదివారం ఆయన తర్లువాడలో దళిత రైతులతో సమావేశమై వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల జీవనోపాధికి ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 2 ఎకరాల వంతున భూములు కేటాయించారన్నారు. వివిధ సర్వే నంబర్లలో ఉన్న భూములలో దళితులు 70 ఏళ్లకు పైగా జీడి, మామిడి, సపోటా, నిమ్మ పంటలను మూడు నుంచి నాలుగు తరాలుగా సాగు చేసుకుంటూ ఉన్నారన్నారు. ఇప్పుడు ఈ రైతుల అనుమతి లేకుండా కూటమి ప్రభుత్వం దొడ్డిదారిన భూములు కాజేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. సాగులో ఉన్న రైతుల నుంచి భూములు కాజేయడం చెల్లదని హైకోర్టు స్పష్టం చేసిందన్నారు. వీరి తరపున పోరాటానికి పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.అప్పలనాయుడు రైతులు పాల్గొన్నారు.

## పోలమాంబ ఆలయంలో అన్నసమారాధన

**తగరపువలస:** ఇటీవల సంగివలస పోలమాంబ అలియాస్ ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించిన దేవదాయశాఖ ఆదివారం భారీగా అన్నసమారాధన నిర్వహించింది. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన శ్రీహరి సేవా సమితి సభ్యులు సహాయ సహకారాలు అందించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు.

# రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఆర్ఎం అప్పలనాయుడు

**మధురవాడ:** ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని ఆర్ఎం అప్పలనాయుడు చెప్పారు. ఆదివారం మధురవాడలో నిర్వహించిన రిటైర్డ్ ఎంప్లాయీస్ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఈపీఎఫ్‌కి సంబంధించి సరైన డాటా అందించాల్సి ఉందన్నారు. ఒక్క అక్షరం కూడా తప్పు లేకుండా 10డి ఫారాలు నింపి పంపాలన్నారు. దీనికి ఎటువంటి సహకారం కావాలన్నా విశాఖ జిల్లాలో ఉన్నా యూనిట్లను సంప్రదించవచ్చన్నారు. ఆరోగ్య సమస్యలు పరిష్కారానికి రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, గుండె వైద్య నిపుణుడు అయిన సుబ్రహ్మణ్యాన్ని సంప్రదించాలని, ఎంవీపీలోని సంస్థ డిస్పెన్సరీలో ప్రతి శుక్రవారం ఉచిత కన్సల్టేషన్ సద్వినియోగం చేసుకోవాన్నారు. కార్యక్రమంలో ఏవీ రావు, రాయి, ఇతర విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

# తీరం.. జనసంద్రం



రుషికొండ బీచ్‌లో పర్యాటకుల సందడి

**కొమ్మాది:** పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు సందర్శకుల తాకిడి కనిపించింది. గుడ్లవానిపాలెం బీచ్, సాగర్‌నగర్ బీచ్, రుషికొండ బీచ్, తొట్లకొండ బీచ్, రామానాయుడు ఫిల్మ్ స్టూడియో, ఎర్రమట్టి దిబ్బలు, భీమిలి బీచ్ ప్రాంతాల్లో పర్యాటకుల సందడి నెలకొంది. చిన్నాపెద్దా అంతా ఉత్సాహంగా గడిపారు.

## మత్స్యకార యువకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నూకరాజు తల్లిని పరామర్శిస్తున్న ఉమ్మడి కల్యాణ్

**ఎంవీపీకాలనీ:** జోడుగుళ్లపాలెం మత్స్యకార ప్రాంతానికి చెందిన గరికిన నూకరాజు కుటుంబానికి వైఎస్సార్‌సీపీ 18వ వార్డు అధ్యక్షుడు ఉమ్మడి కల్యాణ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల చేపల వేటకు వెళ్లిన నూకరాజు పడవ బోల్తాపడి ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం కల్యాణ్ తదితర మత్స్యకార యువకులు నూకరాజు కుటుంబ సభ్యులను పరామర్శించి నగదు అందించారు.

# వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులకు పరామర్శ



చెట్ల కొండమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిరి సహస్ర (ఇన్‌సెట్‌లో) బోర జగదీష్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిరి సహస్ర

**తగరపువలస:** జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డులో ఇటీవల మరణించిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆదివారం చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర పరామర్శించి చనిపోయిన వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ముందుగా రాజులింగంపేటలోని మృతుడు బోర జగదీష్‌కు పూలమాల వేసి ఆయన తల్లిదండ్రులను ఓదార్చారు. అలాగే సంతపేటలో చనిపోయిన చేట్ల కొండమ్మకు నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల భాస్కరరెడ్డి, బింగి హరికిరణ్‌రెడ్డి, జీరు వెంకటరెడ్డి, డబ్బీరు ప్రశాంతి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, చిప్పాడ వెంకటేష్, కొండపు సూరిబాబు, మునకాల ఆదినారాయణరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో విలవిల

- ఆర్‌హెచ్ కాలనీలో క్షీణిస్తున్న పారిశుధ్యం
- వ్యర్థాలతో నిండిపోయిన డ్రైనేజీలు
- వీధుల్లో పేరుకుపోయిన మట్టి పోగులు
- గంజాయి, మద్యం సేవించి పెడతోవ పడుతున్న యువత



డ్రైనేజీ జంక్షన్ వద్ద జామైపోయిన చెత్తాచెదారం



ఆర్‌హెచ్ కాలనీలోని ఇరుకు వీధి



రోడ్డు మధ్యలో వేసిన మట్టి పోగులు



డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

**పీఎం పాలెం:** జీవీఎంసీ 6వ వార్డులోని ఆర్‌హెచ్ కాలనీ వాసులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ కాలనీ ఏర్పడి మూడు దశాబ్దాలు పూర్తయినా అభివృద్ధిలో వెనుకంజలోనే ఉంది. కాలనీలో సుమారు ఏడెనిమిది వందల కుటుంబాలు నివసిస్తున్నాయి. అంతా సామాన్య, మధ్య తరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన వారే. కాలనీలో సురక్షితమైన డ్రైనేజీ సదుపాయంలేదు. పారిశుధ్యం కూడా అంతంతమాత్రమే. ఇక్కడి కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈగలు, దోమల వ్యాప్తి అధికంగా ఉంది. దీంతో డయేరియా, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు చుట్టు ముట్టే ప్రమాదం ఉందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రహదారులపై అడ్డంకిగా మట్టిపోగులు..**

ఇటీవల భూగర్భ విద్యుత్ లైన్ల ఏర్పాటులో భాగంగా పెద్ద పెద్ద గోతులు తవ్వగా వచ్చిన మట్టిని రోడ్డు మధ్యలో వేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడంలేదు.

**అందుబాటులో లేని పార్కులు..**

వేల మంది నివసిస్తున్నా కాలనీవాసులు సంధ్యా సమయంలో సేద దీరడానికి అవసరమైన పార్కుల సదుపాయం లేదు. ఉన్న పార్కును అభివృద్ధి చేయలేదు. పాత పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు కొత్తవి నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**పెడతోవ పడుతున్న యువత..**

పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఆర్‌హెచ్ కాలనీకి చెందిన యువకులపై అనేక కేసులు నమోదై ఉన్నాయి. జనావాసాల మధ్యలో ఉన్న ఖాళీ స్థలాల్లో రాత్రిళ్లు వీరు మద్యం, గంజాయి సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, దీనివల్ల కాలనీ అశాంతికి నిలయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పోలీసు అధికారులు స్పందించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఇరుకు రోడ్లతో అవస్థలు..**

అగ్ని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు సంభవించేటప్పుడు కాలనీలోకి భారీ వాహనాలు ప్రవేశించడానికి అనుకూలంగా రోడ్డు సదుపాయంలేదు. కాలనీ మొత్తం ఇరుకైన పాడవు రోడ్లతో వ్యాపించి ఉంది. ద్విచక్ర వాహనాలు తప్ప మరే వాహనాలు కాలనీలోని వీధుల్లోకి వచ్చేందుకు వీల్లేకుండా ఉంది.

### దోమలను నివారించాలి..



డ్రైన్లలో పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా కాలనీలో దోమలు, ఈగల వ్యాప్తి అధికగా ఉంది. వీటి నివారణకు క్రిమి సంహారక మందులు తరచూ కాలనీలో పిచ్‌కారీ చేస్తూ ఉండాలి. అలాగే డ్రైన్లలో పేరుకు పోయిన వ్యర్థాలను తొలగించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి.

– పి. గురుమూర్తి, ఆర్‌హెచ్ కాలనీ, పీఎం పాలెం

### పోలీస్ బీట్ ఏర్పాటు చేయాలి..



కాలనీలో గంజాయి, మద్యం సేవించే వారి నుంచి రక్షణకు కాలనీలో పోలీసు బీటు ఏర్పాటు చేయాలి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పై పోలీసులు చర్యలు తీసుకోవాలి. పెడతోవ పడుతున్న యువతను సరైన మార్గంలో పెట్టాలి.

– కేఎస్‌పీ చక్రవర్తి, ఆర్‌హెచ్‌కాలనీ, పీఎం పాలెం